శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మతపర పోస్టుల భర్తీకి రాత, మౌఖిక పరీక్షలు

పారదర్శకంగా నిర్వహించిన నియామక ప్రక్రియ – ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

భద్రాచలం, 13/06/26 వుదయం ప్రతినిధి

దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భద్రాచలంలో ఖాళీగా ఉన్న వివిధ మతపర పోస్టుల భర్తీ ప్రక్రియను దేవాదాయ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు విడుదల చేసిన నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జా భవన్ ధర్మశాలలో రాత మరియు మౌఖిక పరీక్షలను నిర్వహించారు.

ఈ పరీక్షలు అదనపు కమిషనర్ పర్యవేక్షణలో, సంబంధిత పోస్టులకు నియమించబడిన చీఫ్ ఎగ్జామినర్, కమిటీ సభ్యులు మరియు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించబడ్డాయి. అభ్యర్థుల మతపర పరిజ్ఞానం, వేదశాస్త్ర అవగాహన, ఆగమ సంప్రదాయాలపై పట్టు, ఆలయ విధివిధానాలపై అవగాహన, సేవాభావం, క్రమశిక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

దేవస్థానంలో మతపర సేవలు అత్యంత ప్రాముఖ్యత కలిగినవిగా భావించబడుతున్న నేపథ్యంలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు సమాచారం. ఆలయ సంప్రదాయాలు, శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచార వ్యవహారాలు, నిత్య కైంకర్యాలు, ఉత్సవాల నిర్వహణ వంటి అంశాల్లో అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.పరీక్షల నిర్వహణ సందర్భంగా అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.రాత పరీక్షల్లో అభ్యర్థుల జ్ఞానాన్ని అంచనా వేయగా, మౌఖిక పరీక్షల ద్వారా వారి వ్యక్తిత్వం, సేవా దృక్పథం, మతపర అంశాలపై అవగాహనను పరిశీలించారు. నియామక ప్రక్రియలో ఎటువంటి పక్షపాతం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించినట్లు అధికారులు వెల్లడించారు.దేవాదాయ శాఖ అధికారులు ముందస్తుగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం పరీక్షల నిర్వహణ సాగింది. పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల నమోదు, ధ్రువపత్రాల పరిశీలన, హాజరు నమోదు, పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు క్రమబద్ధంగా జరిగాయి. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లు చేశారు.శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసాన్ని పొందిన ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో ఇక్కడ విధులు నిర్వర్తించే మతపర సిబ్బందిపై ప్రత్యేక బాధ్యత ఉంటుంది. అందువల్ల నియామకాల్లో నాణ్యత, అర్హతలు, సంప్రదాయాల పట్ల నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మతపర పోస్టుల భర్తీ పూర్తయిన అనంతరం దేవస్థానంలో నిర్వహించే నిత్య పూజలు, అర్చనలు, వేదపారాయణాలు, ప్రత్యేక ఉత్సవాలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులకు మరింత మెరుగైన ఆధ్యాత్మిక సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నియామక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

పరీక్షల నిర్వహణలో పాల్గొన్న కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఎటువంటి వివాదాలు, అభ్యంతరాలు లేదా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మొత్తం ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తయింది. పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, పారదర్శక విధానంలో అవకాశాలు కల్పించిన దేవాదాయ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మతపర సేవల నాణ్యతను మరింత పెంపొందించేందుకు చేపట్టిన ఈ నియామక ప్రక్రియ ఆలయ పరిపాలనలో మరో ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో పారదర్శకత, నిష్పక్షపాత విధానాలతో నియామకాలు కొనసాగాలని భక్తులు కోరుతున్నారు.

సరిహద్దుల భద్రతే కాదు.. ప్రాణాల రక్షణలోనూ సిఆర్పిఎఫ్ జవాన్ల సేవా స్ఫూర్తి

చర్ల జూన్ 14. 06.2026

(వుదయం ప్రతినిధి)

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఆర్పిఎఫ్ 151వ బెటాలియన్ ఆధ్వర్యంలో కలివేరు 151 సిఆర్పిఎఫ్ క్యాంప్ కార్యాలయం లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి సహకారంతో యూనిట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సిఆర్పిఎఫ్ అధికారులు, జవాన్లు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సిఆర్పిఎఫ్ 151వ బెటాలియన్ కమాండెంట్ రాజీవ్ కుమార్ సమక్షంలో, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కింటాలి సౌమ్య, అసిస్టెంట్ కమాండెంట్లు అశుతోష్ సారంగి, శుభం కుమార్ మహోరియా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశంతో జవాన్లు ముందుకు వచ్చి మొత్తం 18 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. సేకరించిన రక్తాన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే ఈ రక్తం స్థానిక ఆరోగ్య సేవలకు ఎంతో తోడ్పాటునందించనుంది. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చనే అవగాహనను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే సిఆర్పిఎఫ్ జవాన్లు, సామాజిక బాధ్యత విషయంలోనూ ముందుంటున్నారని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

యూనిఫామ్‌లో కర్తవ్య నిర్వహణతో పాటు మానవతా దృక్పథంతో ప్రజల సంక్షేమానికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

రక్తానికి ప్రత్యామ్నాయం లేని నేపథ్యంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, ఒక యూనిట్ రక్తం పలువురి ప్రాణాలను కాపాడగలదని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం వేళ నిర్వహించిన ఈ కార్యక్రమం రక్తదానంపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించడంతో పాటు సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 151వ బెటాలియన్‌కు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం పట్ల తమ నిబద్ధతను చాటుతూ జవాన్లు చేసిన ఈ రక్తదానం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది.

నిబంధనలు పాటించని విత్తన వ్యాపారులపై చర్యలు

చర్ల జూన్ 14. 06.2026

(వుదయం ప్రతినిధి)

నిభందనలు పాటించని విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఆత్మ కమిటీ చైర్మన్ హెచ్చరించారు . ఆయన మాట్లాడుతూ చర్ల మండల పరిధిలోని వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు . హెచ్‌డీ పత్తి విత్తనాలు లేదా ఇతర నిషేధిత విత్తనాలను విక్రయించిన వ్యాపారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. మిర్చి విత్తనాలు సహా అన్ని రకాల విత్తనాలను రైతులకు విక్రయించే సమయంలో సంబంధిత కంపెనీ పేరు, లాట్ నంబర్, ధర తదితర వివరాలను స్పష్టంగా నమోదు చేసి ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయించిన , సరైన వివరాలు లేకుండా రైతులకు విత్తనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్మ కమిటీ చైర్మన్ తెలిపారు . వ్యాపారులు రైతుల అవసరాలను తెలుసుకొని, వారి భూమి నీటి ఆధారితమా, వర్షాధారితమా అనే విషయాలను అడిగి తగిన విత్తనాలను సూచించి విక్రయించాలని ఈ సందర్భంగా కోరారు.

నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై సంబంధిత శాఖ అధికారుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విత్తన వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ విషయంలో వ్యాపార సంఘాలు పూర్తి సహకారం అందించాలని ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు .



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ సమావేశం.

మధిర,జూన్ 14, వుదయం ప్రతినిధి:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఆదివారం మధిర రెడ్డి గార్డెన్ కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు

. దీనిపై బిఎల్ఏ లు అప్రమత్తంగా ఉండాలన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం ఓటర్ల జాబితాలో మార్పులు చేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని రాయల నాగేశ్వరావు స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

“మీకోసం మేమున్నాం”

చర్ల జూన్ 14.06.2026

(వుదయం ప్రతినిధి)

మీ కోసం మేమున్నాం అంటూ ఆపదలో అండగా నిలుస్తున్న నీలి ప్రకాష్ సేవలను మండల ప్రజల ప్రశంశిస్తున్నారు. బాధితులకు దాతలకు వారధిగా మారి ఎన్నో కుటుంబాల్లో ఆశాకిరణాలు వెలిగిస్తున్న సేవాతత్పరుడు, సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న నీలి ప్రకాష్‌కు అభినందనల వెల్లు వెత్తుతున్నాయి.

ప్రస్తుత సమాజంలో సొంత వారే కష్టకాలంలో దూరంగా నిలిచే సందర్భాలు పెరుగుతున్న తరుణంలో, “మీకోసం మేమున్నాం” అనే భరోసా మాటను చేతల్లో చూపిస్తూ అనేక మంది బాధితులకు అండగా నిలుస్తున్న నీలి ప్రకాష్ సేవలు ప్రశంసనీయంగా నిలుస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి దాతల సహకారాన్ని అందిస్తున్న ప్రకాష్, వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నారు.

బాధితులు, దాతల మధ్య వారధిగా వ్యవహరిస్తూ అవసరమైన చోట సహాయం చేరేలా సమన్వయం చేయడంలో నీలి ప్రకాష్ చూపుతున్న నిబద్ధత విశేషమని లబ్దిదారులు పేర్కొంటున్నారు. సహాయం కోసం వచ్చిన ప్రతి విజ్ఞప్తిని మానవతా దృక్పథంతో పరిశీలించి స్పందించడం వల్ల ఎంతో మంది కుటుంబాలకు ఆయన ఆశ్రయంగా మారారని చెబుతున్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలు చేయడం ఒక విషయం అయితే, వాటిని నిరంతరంగా కొనసాగించడం మరో విషయం. ఆ దిశగా నీలి ప్రకాష్ వందలాది సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందించడం, దాతల సహకారాన్ని సమీకరించడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం వంటి కార్యక్రమాల ద్వారా మానవత్వానికి కొత్త నిర్వచనం ఇస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సేవ అంటే కేవలం విరాళాలు ఇవ్వడం మాత్రమే కాదు, అవసరంలో ఉన్న వ్యక్తిని గుర్తించి అతనికి సహాయం అందేలా మార్గం చూపడం కూడా. ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ నీలి ప్రకాష్ సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. తనకు ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా, ఇతరుల కష్టాలను తన కష్టాలుగా భావించి పరిష్కార మార్గాలను వెతకడం ఆయన సేవా తత్వానికి మండల ప్రజలు ఫిదా అవుతున్నారు.

నేటి కాలంలో మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని తరచూ వినిపిస్తున్నప్పటికీ, నీలి ప్రకాష్ వంటి వ్యక్తులు సమాజంలో ఇంకా మానవత్వం సజీవంగా ఉందని నిరూపిస్తున్నారని తెలిపారు . కుటుంబ సభ్యులే కొన్నిసార్లు వెనక్కి తగ్గే పరిస్థితుల్లో, పరుల బాధలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవడం గొప్ప సామాజిక బాధ్యతగా భావించవచ్చని అన్నా భాదిత కుటుంబ సభ్యులు .

ప్రజలు కూడా నీలి ప్రకాష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తున్నారు. సమాజం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఇలాంటి సేవాభావులు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

“ఆపదలో అండగా నిలిచే చేయి దేవుడితో సమానం” అనే మాటకు నీలి ప్రకాష్ సేవలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయని ప్రజలు కొనియాడుతున్నారు.

రామా ఏంటి ఈ దుస్థితి


Survey No./ Sub-Division No.
68/3
Pattadar Name
రాముడి గుడి / రాముడి గుడి
Father / Husband's Name
గుమది ఉష W/o సత్యనారాయణ / గుమది ఉష W/o సత్యనారాయణ
Caste Category
Gender
Unknown

చర్ల జూన్ 14.06.2026

(వుదయం ప్రతినిధి)

చర్ల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీరాముడు మీద ఉన్న భక్తితో దానం చేసిన 84 సెంట్ల భూమి డంపింగ్ యార్డుగా మారిందని ఆరోపిస్తున్న గ్రామస్తులు. భద్రాచలం దేవాలయ అధికారుల నిర్లక్ష్యంపై దాత ఆవేదన. సర్వే నం. 68/3లో ఉన్న విలువైన భూమిని శుభ్రపరచి కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ గ్రామస్తులు. “రాముడిపై భక్తితో ఇచ్చిన భూమికి ఈ పరిస్థితి ఎందుకు” అని దాతలు వాపోతున్నారు. భక్తితో దేవాలయ అభివృద్ధి కోసం దానం చేసిన భూమి నేడు చెత్తాచెదారంతో నిండిన డంపింగ్ యార్డుగా మారడంతో దాతతో పాటు గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి. ఉష భర్త సత్యనారాయణ చెందిన సుమారు 84 సెంట్ల భూమిని దేవాలయ నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం దేవాదాయ శాఖకు అందజేశారు. అయితే ప్రస్తుతం ఆ భూమి పూర్తిగా నిర్లక్ష్యానికి గురై చెత్త నిల్వ కేంద్రంలా మారిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం, సర్వే నంబర్ 68/3లో ఉన్న ఈ భూమి ప్రస్తుతం లక్షల రూపాయల విలువ కలిగి ఉంది. భక్తి భావంతో దానం చేసిన ఈ స్థలాన్ని అధికారులు పరిరక్షించకపోవడంతో అక్కడ చెత్త, మురుగు మరియు వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి అసహ్యకర వాతావరణం నెలకొంది. దాత గుమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ, “శ్రీరాముడిపై ఉన్న అపార భక్తితో ఈ భూమిని దేవాలయ అవసరాల కోసం ఇచ్చాను. అప్పట్లో దాని విలువ సుమారు రూ.2.25 వేలుగా ఉన్నా, నేడు లక్షల రూపాయల విలువ కలిగిన ఆస్తిగా మారింది. కానీ ఆ భూమిని ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం బాధాకరం. నా వద్దే ఉంటే శుభ్రంగా ఉంచుకునేవాడిని” అని వాపోయారు. అలాగే, “దేవాలయ నిర్మాణం లేదా ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారని భావించి ఇచ్చిన భూమిని డంపింగ్ యార్డుగా మార్చడం బాధ కలిగిస్తోంది. ఇప్పటికైనా భద్రాచలం దేవాలయ అధికారులు స్పందించి భూమిని పూర్తిగా శుభ్రపరిచి చుట్టూ కంచె ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే ఆ భూమిని తిరిగి నాకు అప్పగిస్తే పేదలకు పంచేందుకు సిద్ధంగా ఉన్నాను” అని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేవాలయ భూమి విషయంలో గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై గ్రామస్తులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయాల అభివృద్ధి కోసం తమ ఆస్తులను దానం చేసే వారిలో విశ్వాసం పెరగాల్సిన సమయంలో, దానం చేసిన భూములే నిర్లక్ష్యానికి గురైతే భవిష్యత్తులో ఎవరూ ముందుకు రావడానికి ఆసక్తి చూపరని వారు అభిప్రాయపడుతున్నారు. దాతలు తమ సొంత ఆస్తిని భక్తి, విశ్వాసాలతో దేవాలయాలకు ఇస్తారు. అలాంటి భూములను అధికారులు సంరక్షించకపోతే దాతల మనోభావాలు దెబ్బతింటాయని ఆరోపిస్తున్న గ్రామస్తులు . ఇది దేవాలయాల పట్ల ప్రజల విశ్వాసానికీ ప్రతికూల సంకేతాలను పంపుతుందని అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. దేవాలయాలకు దానం చేసిన భూములు కేవలం ఆస్తులు మాత్రమే కాదు, అవి భక్తుల విశ్వాసానికి ప్రతీకలు. అలాంటి భూములను గుర్తించి, రికార్డులను సక్రమంగా నిర్వహించి, ఆక్రమణలు లేదా చెత్త పేరుకుపోకుండా పరిరక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత. భూములు ఖాళీగా ఉన్నా కనీసం కంచె ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా వాటి పరిరక్షణ సాధ్యమవుతుందని గ్రామస్తులు కోరుతున్నారు. కొత్తపల్లి ఘటనలో భూమి నిర్వహణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూమి దేవాదాయ శాఖ ఆధీనంలో ఉందా, ఉంటే దాని సంరక్షణకు ఏ చర్యలు తీసుకున్నారు ప్రస్తుతం ఆ స్థలాన్ని ఎవరు చెత్త వేయడానికి ఉపయోగిస్తున్నారనే అంశాలపై స్పష్టత అవసరం ఉంది. దాత, గ్రామస్తుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని భద్రాచలం దేవాలయ అధికారులు తక్షణమే స్పందించి భూమిని పరిశీలించి, శుభ్రపరిచే పనులు చేపట్టి, కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే కాకుండా, భవిష్యత్తులో దేవాలయాలకు దానాలు అందించే వారిలో నమ్మకాన్ని పెంపొందించేందుకు కూడా ఇది అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రామన్నపాలెం లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్, ఉప సర్పంచ్

సత్తుపల్లి జూన్ 14

(వుదయం ప్రతినిధి)

వేంసూరు మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించిన *ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. కడారి రంజిత్ కుమార్ ఎం.డి , డా. శిరీష ఎంబిబిఎస్ సేవలు అందించారు. బి.పి., షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు జ్వరం, నీరసం, శరీర నొప్పులు తదితర ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి, బీసీ జేఏసీ తెలంగాణ కోకన్వీనర్ నూనె హరిబాబు యాదవ్, వార్డు సభ్యులు ఎస్.కే. మొగల్ సాహెబ్, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నాంపల్లి పద్మశాలి సంఘం మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

చండూరు - నాంపల్లి జూన్ 14 (వుదయం) :

నాంపల్లి మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్, కుల పెద్దల సమక్షంలో ఈ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో ముగిసింది. సంఘం అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, యువతకు మార్గదర్శకత్వం కల్పించడంతో పాటు కుల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు కుల పెద్దలు ఈ సందర్భంగా తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా నక్క చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా గోలి కృష్ణ, కోట అయోధ్య, ప్రధాన కార్యదర్శిగా పున్న కోటేశ్వర్, కార్యదర్శిగా కర్నాటి శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో కుల పెద్దలు, సంఘ సభ్యులు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ... తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సంఘ అభివృద్ధి, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండలంలోని పద్మశాలి సంఘానికి చెందిన పెద్దలు, యువకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

రైతులకు వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచనలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 14

(వుదయం ప్రతినిధి):

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా రైతులకు వ్యవసాయ శాఖ అధికారి బాబురావు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 8 నాటికి నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించిన నేపథ్యంలో రానున్న రోజుల్లో సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.వర్షాధార పంటల సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నందున రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుము, ఆముదం వంటి పంటల సాగుకు సిద్ధం కావాలని సూచించారు. విత్తనాల ఎంపికలో ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనా



లను మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన కాలువలు ఏర్పాటు చేయాలని, నేలలో సరిపడ తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తాలని రైతులకు సూచించారు. కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే అధిక లేదా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు.వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెరువులు, కుంటలు మరియు ఇతర నీటి వనరులను శుభ్రపరిచి వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని, పశువులను కూడా అక్కడ ఉంచకూడదని హెచ్చరించారు. వేరుశనగ, సోయాబీన్, జొన్న, పెసర, కంది, మినుము వంటి పంటల విత్తనాలను విత్తే ముందు శాస్త్రీయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా ప్రారంభ దశలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

వరి నారుమళ్ల కోసం నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048) వంటి అధిక దిగుబడి రకాలను వినియోగించాలని సూచించారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు పనులు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారి బాబురావు విజ్ఞప్తి చేశారు.

వృద్ధుల ఆశీస్సులతో విజయవంతమైన అన్నదాన కార్యక్రమం – వాసవి క్లబ్ సారపాక గ్రేటర్ సేవలకు ప్రశంసల వెల్లువ

భద్రాచలం, జూన్ 14 (వుదయం ప్రతినిధి):

సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తున్న వాసవి క్లబ్ సారపాక గ్రేటర్ మరియు వాసవి మహిళా సారపాక ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలోని సరోజినీ వృద్ధాశ్రమంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రీజియన్ చైర్మన్ అవేర్‌నెస్ విజిట్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం వృద్ధాశ్రమ వాసుల హృదయాలను హత్తుకుంది. వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం, ఆప్యాయతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం సమాజంలో అనేక మంది వృద్ధులు కుటుంబ సభ్యులకు దూరంగా వృద్ధాశ్రమాల్లో జీవనం సాగిస్తున్న నేపథ్యంలో వారికి మానసిక ధైర్యం కల్పించడం, ఆప్యాయత పంచడం, వారి అవసరాలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. వాసవి క్లబ్ సారపాక గ్రేటర్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్ రావు మాట్లాడుతూ, వాసవి క్లబ్ స్థాపన ఉద్దేశమే సేవ అని అన్నారు. విద్యార్థులకు విద్యా సహాయం, పేదలకు అవసరమైన వస్తువుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో తమ క్లబ్ ముందుంటుందని చెప్పారు.

కార్యదర్శి బచ్చు సతీష్ మాట్లాడుతూ, వృద్ధుల చిరునవ్వులు తమకు మరింత సేవా స్ఫూర్తిని ఇస్తాయని అన్నారు. వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం చూపించడం ద్వారా యువతకు మంచి సందేశం ఇవ్వవచ్చన్నారు. కోశాధికారి కంచర్ల గౌతం కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు సభ్యులంతా ఏకతాటిపై నిలవడం వల్లే విజయాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు.



వాసవి మహిళా సారపాక అధ్యక్షురాలు కుంజర్ల నిరోషా మాట్లాడుతూ, మహిళలు కూడా సామాజిక సేవలో ముందుండాలని, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి పాల్వాయి పావని మాట్లాడుతూ వృద్ధులకు ప్రేమ, ఆదరణ అందించడం ద్వారా వారికి కొత్త ఉత్సాహం కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జోన్2 చైర్మన్ భూమా వెంకట చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ వి106ఏ వీకేఎస్పీ ఇన్‌చార్జ్ కేతేపల్లి ప్రవీణ్, డిస్ట్రిక్ట్ వి106ఏ జాయింట్ సెక్రటరీ Vn KCGF చారుగుండ్ల రామకృష్ణ, రేపాక రాజ్యలక్ష్మి, గుంటుపల్లి జగదీష్, పచ్చిపులుసు వెంకట సుబ్బారావు, పచ్చిపులుసు లలిత కుమారి, కేతేపల్లి భవానితో పాటు క్లబ్ సభ్యులు, మహిళా విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు వాసవి క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో వృద్ధులను గౌరవించే సంస్కృతి మరింత బలోపేతం కావాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని ఆకాంక్షించారు. వృద్ధుల ఆశీస్సులతో ముగిసిన ఈ కార్యక్రమం భద్రాచలం పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలకు ఒక మంచి ఉదాహరణగా నిలిచింది.

"వృద్ధుల సేవే నిజమైన మానవ సేవ" అనే సందేశాన్ని చాటిచెప్పిన ఈ కార్యక్రమం అందరి హృదయాలను హత్తుకుంది.

సోంపల్లి ఇసుక ర్యాంపులో చిత్రాలు-విచిత్రాలు

అనుమతులు ఒకచోట...
తవ్వకాలు మరోచోట..!
ప్రశ్నించిన గ్రామస్తులపై దాడులు,
బెదిరింపుల ఆరోపణలు
కిన్నెరసాని వాగు భవిష్యత్తుపై రైతుల ఆందోళన
బూర్గంపాడు మండలం, సోంపల్లి:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 14 (వుదయం ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అధికారుల నుంచి పొందిన అనుమతులకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయంటూ స్థానిక రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో జిల్లా కలెక్టర్ అనుమతులతో సోంపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 203/5A, 8, 9 తదితర వ్యవసాయ భూముల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించి తరలించేందుకు అనుమతి మంజూరైనట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఆ అనుమతుల పరిధిని దాటి కిన్నెరసాని వాగులోనే భారీగా తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.వాగులో అక్రమ తవ్వకాలపై విమర్శలుఅనుమతులు పొందిన ప్రాంతాల్లో కాకుండా వాగు పరిధిలో అధిక లోతుతో తవ్వకాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణయించిన మార్గాల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయ రహదారులను వినియోగిస్తూ ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామ రహదారులు దెబ్బతింటుండటంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందా?ఇసుక ర్యాంపు పరిసర ప్రాంతాల్లో పేకాటతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రశ్నిస్తే దాడులా?అక్రమ తవ్వకాలు, ఇసుక రవాణాపై ప్రశ్నించిన గ్రామానికి చెందిన పలువురు యువకులపై ర్యాంపు నిర్వాహకులు దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఐదుగురు యువకులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. గ్రామస్తుల ఫిర్యాదులపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.కిన్నెరసాని వాగు భవిష్యత్తుపై రైతుల ఆందోళన

వాగులో విచ్చలవిడిగా లోతైన తవ్వకాలు కొనసాగితే రాబోయే రోజుల్లో కిన్నెరసాని వాగులో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతిని భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగు సహజ స్వరూపం దెబ్బతింటే వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత తగ్గే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.

అధికారుల స్పందన ఏమిటి?సోంపల్లి ఇసుక ర్యాంపులో జరుగుతున్న తవ్వకాలు అనుమతుల మేరకే జరుగుతున్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయా? అనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా
పనిచేయాలి - కుంజా ధర్మా

భద్రాచలం, 14/06/2026, వుదయం ప్రతినిధి
భద్రాచలంలోని భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ప్రజా సమస్యల పరిష్కారం, రాబోయే రాజకీయ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశాభివృద్ధి, జాతీయత, ప్రజాసేవ అనే సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్న ఉద్యమమని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి కార్యకర్త తన గ్రామంలో, తన బూత్‌లో పార్టీ ప్రతినిధిగా పనిచేస్తూ ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు.

ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక ప్రజా సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని ఆయన అన్నారు. రైతులు, మహిళలు, యువత, చిన్న వ్యాపారులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అని అన్నారు.పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలో కొత్త సభ్యులను చేర్చుకుని పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షించే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని, మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీలను మరింత బలోపేతం చేసి ప్రతి కుటుంబానికి పార్టీ కార్యక్రమాలు చేరేలా చూడాలని అన్నారు.భద్రాచలం నియోజకవర్గంలో పార్టీకి అనుకూల వాతావరణం ఉందని, కార్యకర్తలు మరింత సమన్వయంతో పనిచేస్తే భవిష్యత్తులో పార్టీకి విశేష విజయాలు సాధ్యమవుతాయని ధర్మా పేర్కొన్నారు. పార్టీ జెండా ఎగురవేసే ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల నమ్మకాన్ని పొందాలని సూచించారు.సమావేశంలో ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలను చర్చించి కీలక తీర్మానాలు ఆమోదించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకే పరిమితం కావాలని, అధిక ఫీజులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపవద్దని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం అరికట్టాలని సమావేశం అభిప్రాయపడింది.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు మంజూరు చేయాలని, పేద ప్రజలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గృహ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.SIR కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు.భద్రాచలం పట్టణంలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. అనేక కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనిచేయని వీధిలైట్ల కారణంగా రాత్రివేళల్లో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, గుంతలతో నిండిపోయిన రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

పేద ప్రజలు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ఇసుకను ఉచితంగా అందించాలని సమావేశం తీర్మానించింది. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో పేదలు ఇళ్లు నిర్మించుకోవడం కష్టంగా మారిందని, వారికి ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించాలని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని కోరారు.

ఈ సందర్భంగా ఇటీవల పార్టీలో కీలక బాధ్యతలు స్వీకరించిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ములిశెట్టి రాంమోహన్ రావులను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి వారి సేవలు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

పలువురు నాయకులు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్రామ గ్రామాన పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి వాటి ప్రయోజనాలను మరింత మందికి తెలియజేయాలని నిర్ణయించారు.

రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, యువజన సమావేశాలు, మహిళా సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమంలో తాటి పాముల ఐలయ్య, ముత్యాల శ్రీనివాస్, నిడదవోలు నాగబాబు, పి.సి. కేశవ్, ముత్యాల చంద్రశేఖర్, చెల్లుబోయిన వెంకన్న, ఆవుల సుబ్బారావు, అల్లాడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, అల్లాడి వెంకట సుబ్బారావు, శేర్ శ్రీనివాస్, గంగులకుర్తి రామాచారి, జి. వెంకటేశ్వర్లు, గార్లపాటి శ్రీనివాస్, అన్నం సాయి లక్ష్మణ్, మండల గురుసాయి, జె. ప్రభాకర్, లంకా విమల, కెల్లా అప్పారావు, సి.హెచ్. పాపయ్య, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు ప్రత్యేక సమీక్ష నిర్వహించి, భద్రాచలం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

తలారి హరికృష్ణ ని హత్యే

*** తక్షణమే దోషులను శిక్షించాలి**
తాండూర్ డివిజన్ కమిటీ కన్వీనర్.
కే శ్రీనివాస్, మల్కయ్య
తాండూర్ వుదయం ప్రతినిధి మే 14-

తలారి హరికృష్ణది ముమ్మాటికీ హత్యే 50 రోజులు గడుస్తున్న నిందితులను అరెస్ట్ చేయని పోలీసులు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్న ప్రజా సంఘాల ఐక్యవేదిక తాండూర్ డివిజన్ అధ్యక్షులు కే శ్రీనివాసు మల్కయ్య డిమాండ్ చేశారు ఆదివారం తాండూరు పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సీతారాంపేటలో ప్రజా సంఘాల ఐక్యవేదిక తాండూర్ డివిజన్ నాయకుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకూలీ పనికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన తలారి హరికృష్ణది ముమ్మాటికీ హత్యేనని బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన యువకుడు తలారి హరికృష్ణ ఏప్రిల్ 29న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లాడు.అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.ఈ విషయమై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎలాంటి ఆధారాలు సేకరించలేదని ,ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉందన్నారు.ఇకనైన న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నాయకులు అన్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా దౌల్తాబాద్, నవపేట్, పూడూరు మండలాల్లో ఉన్నారు దళితులపై దాడి చేసిన,కులం పేరుతో దూషించిన పోలీసులు మాత్రం పట్టించుకోకుండా ఎస్సీ ఎస్టీ కేసుల విషయంలో ఎస్ హెచ్ ఓ లు నిర్లక్ష్యం వహిస్తూ దళిత పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారు అని అన్నారు అదేవిధంగా పెద్దముల మండలం మంబపూర్ గ్రామానికి చెందిన యువకులు బైకులతో ఢీకొనగా నమోదు చేయక,అత్యాయత్నం కేసు నమోదు చేసి యువకుడు జీవితాన్ని నాశనం చేశారని, రాజకీయ నాయకుల అండదండలతో తప్పుడు కేసులు నమోదు చేసి పంపిన పెద్దముల్ ఎస్సై ని సస్పెండ్ చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాండూర్ డివిజన్లో జరిగిన జంట హత్యల కేసులో పోలీస్ కస్టడీలో ఉన్న కరిమాబీ పోలీసుల నిర్లక్ష్యం వల్లనే ఆత్మహత్యకు పాల్పడిందని, కరీమా మృతికి బాధ్యులైన వారిపై పూర్తి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రౌండ్ టేబుల్ సమావేశంలో కో కన్వీనర్లు అబ్దుల్ వహాబ్,గుమ్మడి రత్నం,యుబుగ్గప్ప,ఎం బలరాం,ఎస్ రవి, ఆంజనేయులు,లక్ష్మి, సాయిలు, వెంకటయ్య, డి రాజ్ కుమార్ పాల్గొన్నారు

చెన్నరావుపేట మండలం

సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు గా భూక్య మైబు సింగ్ రాథోడ్ పాల్

చెన్నారావుపేట జూన్ 14
(వుదయం న్యూస్ ప్రతినిధి)
చెన్నరావుపేట మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడిగా చెరువు కొమ్ము తండా గ్రామ సర్పంచ్ భూక్య మైబు సింగ్ రాథోడ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ పేర్కొన్నారు..ఈ రోజు నర్సంపేట నియోజకవర్గంలోనీ చెన్నరావుపేట మండల కేంద్రంలో సర్పంచుల ఫోరమ్ మండల కమిటీ ని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడుగా భూక్య మైబు సింగ్ రాథోడ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు మైబు సింగ్ రాథోడ్ మాట్లాడుతూ గౌరవ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు గా ఎన్నిక కావడానికి సహకరించిన కాంగ్రెస్ మండల కమిటీకి ఆయా గ్రామాల సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా మైదం రాకేష్,ప్రధాన కార్యదర్శిగా కుసుమ సతీష్ కోశాధికారిగా బుర్ర సుదర్శన్ గౌడ్ కార్యదర్శి గా మాలోత్ రాంచందర్ సలహదారులుగా పురం అనిత రాంబాబు కంది శ్వేతా క్రిష్ణ చైతన్య రెడ్డి కన్వీనర్లు గా గూడ సంధ్య మహేందర్ లావుడ్యా తిరుపతి కార్యవర్గ సభ్యులుగా కనకమల్లు బొడ రవి లావుడ్యా చందు దారవత్ రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి జిల్లా కార్యదర్శి కంది చైతన్య రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్ ఉప సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ ఆయా గ్రామాల సర్పంచులు ఉమామోహన్ నాయక్ దారా రంజిత్ లావణ్య హనుమ నాయక్ బద్రిఈర్యా నాయక్ పీరి పత్నీ విక్రమ్ బాలు నాయక్ వీరా సింగ్ శారదబాలు నాయక్ జ్యోతి వెంకన్న మాజీ సర్పంచ్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

ప్రమాదవశాత్తు ఇంటిపై పడిన లారీ
సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

భూపాలపల్లి (రేగొండ) జూన్ 14(వుదయం విలేకరి)
భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామం వద్ద రేగొండ నుంచి చిట్యాల వైపు వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ప్రమాదవశాత్తు బింగి బిక్షపతి ఇంటిపై పడింది.ఈ ప్రమాదంలో ఇంటికి తీవ్ర నష్టం సంభవించింది ఈ సందర్భంగా ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లి నుంచి లింగాల గ్రామానికి శుభకార్యానికి వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన జరగటడంతో స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే విషయమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,అధిక లోడుతో ప్రయాణించే వాహనాల డ్రైవర్లు గ్రామాల గుండా వెళ్లేటప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు

.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా
చెస్ టోర్నీలో పాల్గొనండి

జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గందూరి కృపాకర్
సూర్యాపేట, జూన్:14
వుదయం ప్రతినిధి
జూలై 11, 12 తేదీల్లో హైదరాబాద్ నిజాంపేట్ రోడ్, బాచుపల్లిలోని ఎల్.ఎస్.కె చెస్ అకాడమీ, తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ మరియు ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మహావీర చక్ర కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫిడె రేటెడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ఆసక్తిగల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించాలని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గందూరి కృపాకర్ అన్నారు.ఆదివారం సూర్యాపేటలోని టి.టి.డి కళ్యాణ మండపంలో కల్నల్ సంతోష్ బాబు ఫిడె చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో నిర్వహించే చెస్ పోటీల్లో పాల్గొన్న చాలామంది విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో జరిగే టోర్నీల్లో విజేతలుగా నిలుస్తున్నారని తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఇందిర, రవికుమార్, దీక్షిత్, జతిన్ రెడ్డి, అఖిలేష్, చిద్విలాసినికి ఆయన బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంతోష్, ట్రెజరర్ వెంకట మురళి, ఉపాధ్యక్షులు సాయికుమార్, జాయింట్ సెక్రెటరీ లింగా రెడ్డి, ఆర్గనైజర్ కోచ్ శ్రీనివాస రాజు, మనోజ్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలలో సీసీఎస్ పోలీసుల
ఆకస్మిక తనిఖీలు



జయశంకర్ భూపాలపల్లి జూన్ 14(వుదయం జిల్లా ప్రతినిధి)
భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున భూపాలపల్లిలోని పలు లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా లాడ్జిలలో నిర్వహిస్తున్న అతిథుల రిజిస్టర్లు, సీసీ కెమెరాల పనితీరు, బస చేస్తున్న వ్యక్తుల వివరాలను పరిశీలించారు. లాడ్జిలకు వచ్చే ప్రతి వ్యక్తి వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, రాకపోకల సమయాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.నిబంధనలను పాటించని పక్షంలో సంబంధిత లాడ్జి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా భద్రత, నేరాల నియంత్రణలో భాగంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

బ్రాహ్మణపల్లి శివారులోని అంజనాద్రి వద్ద రోడ్డు ప్రమాదం ఆరేడు గ్రామానికి చెందిన గవ్వల సంగయ్య మరొక మహిళకు తీవ్ర గాయాలు.

మాతా శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు – డీఎంహెచ్ఓ రామ్‌కుమార్ హెచ్చరిక హనుమకొండ టౌన్, జూన్ 14 (వుదయం ప్రతినిధి) :
మాతా శిశు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, విధుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.డి. రామ్‌కుమార్ స్పష్టం చేశారు.

ఆదివారం ఆయన జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మితో కలిసి స్థానిక ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, లేబర్ రూమ్, మరియు శిశు విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలతో డీఎంహెచ్ఓ రాంకుమార్ నేరుగా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చేటప్పుడు 102 వాహన సౌకర్యాన్ని వినియోగించుకున్నారా? ఆశా లేదా ఏఎన్ఎం తోడుగా వచ్చారా? అని ఆరా తీశారు.తల్లిపిల్లల సంరక్షణ కార్డులు, మాతా శిశు సంరక్షణ కార్డుల్లో గర్భిణుల ఆరోగ్య వివరాలన్నింటినీ తప్పనిసరిగా, సరిగ్గా నమోదు చేయాలి. ప్రాణాంతక పరిస్థితులు ఉన్న గర్భిణుల విషయంలో క్షేత్రస్థాయి నుంచే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ప్రోగ్రామ్ అధికారిని ఆదేశించారు.

గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో, నాణ్యంగా అందేలా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ పునరుద్ఘాటించారు. ఈ తనిఖీల్లో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



టి.యు.ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా
అధికార ప్రతినిధిగా ఆన్కారి ప్రభాకర్

మహాదేవపూర్ జూన్ 14(వుదయం ప్రతినిధి)
మహాదేవపూర్ మండల మలిదశ తెలంగాణ ఉద్యమములో పాల్గొన్న ఆన్కారి ప్రభాకర్ క్రియాశీలక పాత్రను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఆయనను ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు.దీనికి సహకరించిన రాష్ట్ర టి.యు.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, భూపాల్ పల్లి జిల్లా టీ.యూ.ఎఫ్ అధ్యక్షుడు యాదర్ల గట్టయ్యకు ప్రభాకర్, కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన ఆన్కారి ప్రభాకర్ కు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అయుబుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్ సీనియర్ ఉద్యమకారులు ఎనమండ్ర వామన్ రావు,తదితర మండల ఉద్యమకారులందరూ ఆన్కారి ప్రభాకర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో డఫోడిల్స్
పాఠశాలకు విశిష్ట గుర్తింపు.

డఫోడిల్స్ విద్యాసంస్థల చైర్మన్ చింతల నరేందర్.
వరంగల్ జిల్లా నర్సంపేట జూన్ 14.
ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్రస్థాయి అవార్డుల్లో నర్సంపేట డఫోడిల్స్ పాఠశాల విశిష్ట సేవల విభాగంలో అవార్డును అందుకుంది. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. రక్తదానంపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించడం, స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణ, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినందుకు ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో నర్సంపేటలో అగ్రస్థానంలో నిలిచిన డఫోడిల్స్ పాఠశాల,

ఇప్పుడు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ రాష్ట్రస్థాయి గుర్తింపు పొందడం విశేషం. విద్యలో ప్రతిభతో పాటు సామాజిక బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చైర్మన్ చింతల నరేందర్ తెలిపారు.